# ‘పర్యటన రంగాన్ని మిశన్ మోడ్‌లో అభివృద్ధి చేయడం’ అనే అంశంపై ఏర్పాటైన బడ్జెటు అనంతర వెబినార్

న్యూఢిల్లీ, మార్చి 4:“పర్యటన రంగాన్ని మిశన్ మోడ్ లో అభివృద్ధి పరచడం” అనే అంశం పై ఏర్పాటైన బడ్జెటు అనంతర వెబినార్ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. యూనియన్ బడ్జెటు 2023 లో ప్రకటించిన కార్యక్రమాల ను ప్రభావశీలమైన విధం గా అమలు పరచడం కోసం ఉపాయాల ను మరియు సూచనల ను కోరుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బడ్జెటు అనంతర వెబినార్ లు పన్నెండిటి లో ఈ వెబినార్ ఏడో వెబినార్ గా ఉంది.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ప్రస్తుతం ‘న్యూ ఇండియా’ ఒక నవీన శ్రమ సంస్కృతి లో ముందంజ వేస్తోందన్నారు. ఈ సంవత్సరం బడ్జెటు పై భారతదేశం యొక్క ప్రజానీకం వ్యక్తం చేసిన ప్రశంసల పట్ల సంతోషాన్ని వెలిబుచ్చారు. ఇది వరకటి శ్రమ సంస్కృతి ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, అదే కొనసాగివుండి ఉంటే గనక ఈ తరహా లో బడ్జెటు కు ముందు, బడ్జెటు సమర్పణ తరువాత బడ్జెటు తో అనుబంధం ఉన్న వర్గాల తో చర్చించాలని ప్రస్తుత ప్రభుత్వం చేసినటువంటి వినూత్నమైనటువంటి ఆలోచన ప్రసక్తే ఉండేది కాదు అన్నారు. ఈ వెబినార్ ల ప్రధాన ఉద్దేశ్యం బడ్జెటు యొక్క ఫలితాలు వీలైనంత ఎక్కువ గా ఉండేటట్లు గా చూడటం తో పాటు గా బడ్జెటు ప్రతిపాదనల ను అనుకున్న కాలం లోపల అమలు పరచాలి అనేది కూడా ను అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. “ఈ వెబినార్ లు బడ్జెటు లో నిర్దేశించుకొన్నటువంటి లక్ష్యాల ను సాధించడం లో ఒక ఉత్ప్రేరకం గా పని చేస్తాయి” అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. 20 సంవత్సరాల కు పైబడి ప్రభుత్వ అధినేత గా పాటుపడుతున్న అనుభవం తో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకొనే ఏ వ్యూహాత్మక నిర్ణయాలతో అయినా వాటితో అనుబంధం కలిగిన వర్గాలు అన్నీ కూడా ఒకే తాటి మీద కు వచ్చి పనిచేసినట్లయితే గనక ఆశించిన ఫలితాల ను అనుకున్న కాలం లోపల సాధించవచ్చును అని ఉద్ఘాటించారు. ఇంతవరకు జరిగిన బడ్జెటు అనంతర వెబినార్ ల ద్వారా అందిన సూచన లు సలహా ల పట్ల ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

భారతదేశం లో పర్యటన రంగాన్ని వినూత్న శిఖరాల కు తీసుకొని పోవడాని కి మూస ధోరణి కి భిన్నం గా ఆలోచనలు చేస్తూ, ముందస్తు గా ప్రణాళిక సిద్ధం చేసుకోవలసిన అవసరం ఉంది అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. పర్యటక స్థలాల ను అభివృద్ధి పరచే కంటే ముందు తీసుకోవలసిన జాగ్రతచర్యల ను గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, ఆ ప్రదేశం లోని అవకాశాలు ఎలా ఉన్నాయి?, ఆ ప్రదేశాని కి ఎంత సులభం గా చేరుకోవచ్చు? అనే అంశాల తో పాటు గా ఆ ప్రదేశాన్ని గురించి పలువురికి తెలిసే విధం గా ఏయే కొత్త మార్గాల ను అనుసరించాలి? అనేటటువంటి విషయాల ను గురించి ప్రస్తావించారు. ఈ మాటల ను తాను తెలియ జేయడం లోని ముఖ్యోద్దేశ్యం ఏమిటి అంటే, అది భవిష్యత్తు కాలాని కి ఒక మార్గసూచీ ని సిద్ధం చేయడం లో సహాయకారి అవుతుందన్నదే అని కూడా ఆయన అన్నారు. దేశం లో పర్యటన రంగాని కి ఉన్న భారీ అవకాశాల ను ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రస్తావిస్తూ, కోస్తా తీర ప్రాంతాల లో పర్యటన, సముద్రం ఒడ్డుల లో పర్యటన, మడ అడవుల లో పర్యటన, హిమాలయ ప్రాంతాల లో పర్యటన, సాహస యాత్ర ప్రధానమైనటువంటి పర్యటన, వన్యప్రాణి సందర్శన ప్రధానం గా ఉండేటటువంటి పర్యటన, ఇకో-టూరిజమ్, వారసత్వ పర్యటక ప్రదేశాల లో పర్యటించడం, ఆధ్యాత్మిక కేంద్రాల సందర్శన, పరిణయ ప్రధానమైన పర్యటక స్థలాల ను సందర్శన, సమావేశాల మాధ్యం ద్వారా పర్యటకానుభూతి ని పొందడం మరియు క్రీడా ప్రధానమైన పర్యటనల వంటి వాటి ని గురించి పేర్కొన్నారు. రామాయణ్ సర్ కిట్, బుద్ధ సర్ కిట్, కృష్ణ సర్ కిట్, నార్థ్ ఈస్టర్న్ సర్ కిట్, గాంధీ సర్ కిట్ లతో పాటు గురువు ల పరంపర లో ఏర్పడ్డ తీర్థక్షేత్రాల ను గురించి సైతం ఆయన ఉదాహరణలు గా పేర్కొంటూ వీటన్నింటి విషయం లో సామూహికం గా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సంవత్సరం బడ్జెటు లో స్పర్థాత్మకమైన భావన తోను మరియు చాలింజ్ రూట్ లోను భారతదేశం లో కొన్ని పర్యటక ప్రదేశాల ను అభివృద్ధిపరచాలని గుర్తించడం జరిగిందన్నారు. ఈ చాలింజ్ ప్రతి ఒక్క స్టేక్ హోల్డర్ తోకలిసి ప్రయాస చేసేందుకు ప్రేరణ ను అందిస్తుందన్నారు. దీనికోసం, వేరు వేరు స్టేక్ హోల్డర్స్ ను మనం ఏ విధం గా నిమగ్నం చేయవచ్చో అనే అంశం పై సమగ్రమైన చర్చ ను చేపట్టాలి అని శ్రీ నరంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు.

టూరిజమ్ అంటే అది దేశం లో అధిక ఆదాయ సమూహాల తో మాత్రమే ముడిపడినటువంటిది అనే ఒక స్వైరభావం అనే కల్పన ను ప్రధాన మంత్రి తోసి పుచ్చారు. యాత్ర లు అనేవి కొన్ని వందల ఏళ్ళు గా భారతదేశం లో సాంస్కృతిక మరియు సామాజిక జీవనం లో ఒక భాగం గా ఉంటున్నాయి. ప్రజలు వారి వద్ద ఎటువంటి తాహతు లేకపోయినా తీర్థయాత్రల కు బయలుదేరే వారు అని ఆయన అన్నారు. చార్ ధామ్ యాత్ర, ను, ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర ను,, 51 శక్తిపీఠాల యాత్ర ను ఉదాహరణలు గా ఆయన చెప్తూ, అవి మన ధార్మిక స్థలాల తో కలుపుతూ నే దేశం లో ఏకత్వ భావన ను కూడా బలపరచేవని తెలిపారు. దేశం లో ఎన్నో పెద్ద నగరాల లో యావత్తు ఆర్థిక వ్యవస్థ ఈ యాత్రల పై ఆధారపడిందని ప్రధాన మంత్రి అన్నారు. యాత్రల ను సాగించే సంప్రదాయం ఏళ్ల నుండి ఉన్నప్పటికీ కూడా ను ఆయా ప్రాంతాల లో కాలానుగుణం గా సౌకర్యాల ను పెంచడం పట్ల శ్రద్ధ లోపించడం శోచనీయం అని ప్రధాన మంత్రి అన్నారు. వందల ఏళ్ళ తరబడి బానిసత్వం మరియు స్వాతంత్ర్యం అనంతర కాలం లో దశాబ్దాల పాటు ఈ ప్రదేశాల ను రాజకీయం గా ఉపేక్షించడం వంటివి దేశాని కి చాలా నష్టం వాటిల్లడానికి ప్రధాన కారణాలు గా ఉన్నాయని ఆయన అన్నారు. “ఈనాటి భారతదేశం ఈ పరిస్థితి ని మార్చుతోంది” అని ప్రధాన మంత్రి అన్నారు. సదుపాయాల ను పెంచడం అనేది పర్యటకుల లో ఆకర్షణ పెరగడాని కి కారణం అవుతుందని ఆయన చెప్పారు. వారాణసీ లోని కాశీ విశ్వనాథ్ ధామ్ ను ఆయన ఒక ఉదాహరణ గా పేర్కొంటూ, ఆ ప్రదేశం లో పునర్ నిర్మాణ పనులు జరగక ముందు ఒక సంవత్సర కాలం లో ఆ ఆలయాన్ని సందర్శించే వారి సంఖ్య దాదాపు గా 80 లక్షలు గా ఉంది, నవీకరణ అనంతరం కిందటి ఏడాది లో యాత్రికుల సంఖ్య 7 కోట్ల ను మించిపోయింది అన్నారు. కేదార్ ఘాటీ లో పునర్ నిర్మాణ పనులు పూర్తి కాకపోవడాని కి ముందు కాలం లో కేవలం 4-5 లక్షల మంది బాబా కేదార్ ను దర్శించుకోగా, తరువాతి కాలంలో భక్తజనుల సంఖ్య 15 లక్షల కు పెరిగింది అని కూడా ఆయన వెల్లడించారు. ఇదే మాదిరిగా గుజరాత్ లోని పావాగఢ్ లో మాత కాళిక ను దర్శించుకోవడం కోసం పునరుద్ధరణ పనులు జరుగక ముందు 4 వేల నుండి 5 వేల మంది మాత్రమే వెళ్తుండే వారు కాస్తా తదనంతర కాలం లో యాత్రికుల సంఖ్య 80 వేల కు చేరుకొందన్నారు. సదుపాయాల ను పెంచడం అనేది పర్యటకుల సంఖ్య పై నేరు గా ప్రభావాన్ని కలుగ జేస్తోందని, యాత్రికుల సంఖ్య పెరుగుతోంది అంటే దాని అర్థం ఉపాధి కల్పన కు మరియు స్వతంత్రోపాధి కల్పన కు మరిన్ని అవకాశాలు ఏర్పడుతున్నాయి అనే అని ప్రధాన మంత్రి వివరించారు. ప్రపంచం లో కెల్లా అతి ఎత్తయినటువంటి విగ్రహం అయిన ‘ద స్టాట్యూ ఆఫ్ యూనిటీ’ ని గురించి కూడా ప్రధాన మంత్రి ప్రస్తావించి, ఆ విగ్రహం ఏర్పాటు పూర్తి అయిన ఒక ఏడాది కాలం లోపలే 27 లక్షల మంది యాత్రికులు ఆ స్థలాన్ని చూశారు అని వెల్లడించారు. పౌర సదుపాయాలు పెరుగుతూ ఉండడం, చక్కని డిజిటల్ కనెక్టివిటీ, మంచి హోటళ్ళు, ఇంకా ఆసుపత్రులు ఏర్పాటు కావడం, ఎలాంటి చెత్త చెదారం లేకుండా పోవడం మరియు ఉత్కృష్టమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటి తో భారతదేశం లో పర్యటక రంగం అనేక రెట్లు పెంపొందగలదు అని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి గుజరాత్ లోని అహమదాబాద్ లో ఉన్న కాంకరియా లేక్ ప్రాజెక్టు ను గురించి కూడా ప్రస్తావిస్తూ, ఆ సరస్సు యొక్క పునరభివృద్ధి పనుల ను చేపట్టడం తో పాటు గా అక్కడి ఫూడ్ స్టాల్స్ లో పని చేసే వారి నైపుణ్యాని కి మెరుగులు దిద్దే కార్యాన్ని కూడా చేపట్టడం జరిగిందని తెలియ జేశారు. ప్రవేశ రుసుము ఉన్నప్పటికీ కూడా ఆ ప్రదేశాన్ని దాదాపు గా 10,000 మంది నిత్యం సందర్శిస్తున్నారు అని ఆయన తెలియజేస్తూ, ఆధునిక మౌలిక సదుపాయాల కు తోడు పరిశుభ్రత ముఖ్యం అని నొక్కి చెప్పారు. “ప్రతి పర్యటక ప్రదేశం తనది అయినటువంటి రాబడి నమూనా ను రూపొందించుకోవచ్చు” అని ప్రధాన మంత్రి అన్నారు.

‘‘మన గ్రామాలు పర్యటన కేంద్రాలు గా మారుతున్నాయి” అని ప్రధాన మంత్రి అన్నారు. మారుమూల పల్లెల లో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నందువల్ల ఆ గ్రామాలు పర్యటన చిత్రపటం లోకి ఆ గ్రామాలు కూడా చేరుతున్నాయి అని ప్రధాన మంత్రి అన్నారు. సరిహద్దు వెంబడి ఉన్నటువంటి పల్లెల కోసమని కేంద్ర ప్రభుత్వం వైబ్రాంట్ విలేజ్ స్కీము ను ప్రారంభించిందని ఆయన చెప్తూ, హోం స్టేస్, చిన్న హోటళ్ళు, రెస్టరాన్ ల వంటి వ్యాపారాల కు సమర్థన ను అందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

భారతదేశం లో విదేశీ యాత్రికుల సంఖ్య పెరుగుతూ ఉండడాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రత్యేకం గా ప్రస్తావిస్తూ, భారతదేశం పట్ల ఆకర్షణ పెరుగుతోంది, గత ఏడాది జనవరి నెల లో 2 లక్షల మంది విదేశీ యాత్రికులు తరలి రాగా, ఆ సంఖ్య తో పోలిస్తే ఈ సంవత్సరం జనవరి లో భారతదేశాని కి వచ్చిన విదేశీ యాత్రికుల సంఖ్య 8 లక్షలు గా ఉంది అని తెలిపారు. అటువంటి యాత్రికుల వివరాల ను దగ్గర పెట్టుకొని, గరిష్ఠ స్థాయి లో డబ్బు ను ఖర్చు పెట్టే స్తోమత కలిగిన యాత్రికుల ను దేశం లోకి వచ్చేటట్లు గా ఆకర్షించడం కోసం ఒక ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించాలని సూచించారు. భారతదేశాని కి విచ్చేసే విదేశీ యాత్రికులు సగటు న 1700 యుఎస్ డాలర్ ను వెచ్చిస్తుంటారని, అదే అంతర్జాతీయ ప్రయాణికులు అమెరికా లో అయితే గనుక సరాసరి 2500 యుఎస్ డాలర్ ను ఖర్చు చేస్తారని, ఆస్ట్రేలియా లో ఈ మొత్తం 5000 డాలర్ వరకు ఉంటుందని ఆయన వివరించారు. “అధికం గా డబ్బు ను ఖర్చు పెట్టే పర్యటకుల కు భారతదేశం మరెంతో అందించ గలుగుతుంది” అని ఆయన చెప్పారు. ఈ భావన తో జత పడడం కోసం ప్రతి ఒక్క రాష్ట్రం తన పర్యటన సంబంధి విధానాన్ని మార్చుకోవలసిన అవసరం ఉంది అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. పక్షి సమూహాల ను చూస్తూ ఆనందించే వారు దేశం లో నెలల తరబడి బస చేస్తుంటారు అని ఆయన ఒక ఉదాహరణ గా చెప్తూ, అటువంటి తాహతు ఉన్న, అటువంటి స్తోమత లు ఉన్న పర్యటకుల ను ఆకట్టుకోవడం కోసం విధానాల ను రూపొందించాలని నొక్కి చెప్పారు.

పర్యటన రంగాని కి ఎదురయ్యేటటువంటి మౌలికమైన సవాలు ను గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా పేర్కొంటూ, ఇక్కడ వృత్తి కౌశలం కలిగినటువంటి తగినంతమంది టూరిస్ట్ గైడ్ లు లేరని, గైడ్ స్ కోసం స్థానిక కళాశాల లలో సర్టిఫికెట్ కోర్సు ల ను నిర్వహించవలసిన ఆవశ్యకత ఉందని నొక్కిచెప్పారు. ఒక ఫలానా పర్యాటక ప్రదేశం లో పని చేస్తున్న గైడ్ లకు ఒక యూనిఫార్మ్ గాని లేదా ప్రత్యేకమైన దుస్తులు గాని ఉన్నట్లయితే పర్యటకులు వారిని తొలి చూపు లోనే గుర్తు పట్టగలుగుతారని ఆయన సూచించారు. ఒక టూరిస్టు మనస్సు లో ఎన్నో ప్రశ్నలు ఉంటాయి; ఆ ప్రశ్నలు అన్నింటి కీ సమాధానాల ను రాబట్టుకోవడం లో వారి కి గైడ్ లు తోడ్పడవచ్చని ప్రధాన మంత్రి అన్నారు.

దేశం లోని పాఠశాల విద్యార్థులు మరియు కళాశాల విద్యార్థులు ఈశాన్య ప్రాంతాల కు ప్రయాణించేటట్టు వారిని ప్రోత్సహించాలని కూడా ప్రధాన మంత్రి నొక్కిచెప్తూ, దీని ద్వారా మరింత ఎక్కువ మంది చైతన్యవంతులవుతారని, పర్యటకుల కోసం మౌలిక సదుపాయాల ను, సౌకర్యాల ను అభివృద్ధి పరచడం మొదలవుతుందని ఆయన వివరించారు. వివాహాల కోసం ప్రత్యేకం గా కొన్ని ప్రదేశాల ను తీర్చిదిద్దాలని, అదే విధం గా క్రీడా ప్రధానమైన ప్రదేశాల ను కూడా తీర్చిదిద్దాలని ఆయన ఉద్ఘాటించారు. 50 పర్యటన ప్రదేశాల ను అభివృద్ధి పరచాలని, అదే జరిగితే ప్రపంచం అంతటి నుండి ప్రతి యాత్రికుడు, ప్రతి యాత్రికురాలు భారతదేశాన్ని తప్పక సందర్శిస్తారని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. పర్యటక ప్రదేశాల కు సంబంధించిన ఏప్స్ ను ఐక్య రాజ్య సమితి లో గుర్తింపు ను పొందినటువంటి అన్ని భాషల లోను అభివృద్ధి పరచాలి అని కూడా ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ, ఈ వెబినార్ పర్యటన రంగాని కి సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని గంభీరం గా పరిశీలించి, మెరుగైన పరిష్కార మార్గాల ను సూచించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ‘‘వ్యవసాయం, స్థిరాస్తి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఇంకా వస్త్రాల రంగాల వలెనే పర్యటన రంగం లో సమాన అవకాశాలు ఉన్నాయి.” అని ప్రధాన మంత్రి అన్నారు.

# విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ‘టెలీ-మానస్’ సేవలు..

హైదరాబాద్, మార్చి 3:పరీక్షలు, ఫలితాల విషయంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్న ఇంటర్ విద్యార్థుల కోసం తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ‘టెలీ- మానస్’ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ‘టెలీ-మానస్’ పేరుతో సైకాలజిస్టుల సేవలు అందించనుంది. ఇంటర్ విద్యార్థులు మానసికి ఒత్తిడిని జయించేందుకు ఈ సేవలు ఉపయోగపడనున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్ చేసి నిపుణులతో కౌన్సిలింగ్ తీసుకోవచ్చని పేర్కొంది. ఈ నెంబర్‌కు ఫోన్ చేసి ఉచితంగా మానసిక వైద్యులను సంప్రదించవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈమేరకు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఇంటర్ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉచితంగా సైకాలజిస్ట్ కన్సల్టేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సాత్విక్ ఘటన, మార్చి 15 నుంచి జరగబోయే ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# రాజన్న జిల్లాలో వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ : ఎస్పీ అఖిల్ మహాజన్

కరీంనగర్, మార్చి 4:రాజన్న సిరిసిల్ల జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి వార్షిక మొబలైజేషన్ లో భాగంగా ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని 17వ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ లో ఫైరింగ్ శిక్షణ ఇచ్చి ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించడం జరిగిందన్నారు. వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న సిబ్బందికి ఇచ్చే ఫైరింగ్ శిక్షణ ను పర్యవేక్షించడంతోపాటు ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ కూడా అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడంతో పాటుగా అన్ని రకాల ఆయుధ పరిజ్ఞానం కూడా కలిగి ఉండాలని, సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా ఏమైనా అల్లర్లు సంభవించినప్పుడు అల్లరి మూకలను చేదరగోటడనికి వజ్ర వెహికల్ ని ఉపయోగించే విధానాన్ని వజ్రా వెహికల్ ఉపయోగించి అల్లరి మూకలు చదరగొట్టడాన్నికి సంబంధించి ట్రెనింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణలో నేర్పించిన మెలకువులను శ్రద్ధతో అభ్యసించి సమయానుకూలంగా శాంతిభద్రతలు పరిరక్షణకు ఉపయోగించాలన్నారు. ఫైరింగ్ లోఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను సిబ్బందిని ఎస్పీ అభినదించారు. ఈ శిక్షణలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐలు కుమారస్వామి, రజినీకాంత్, యాదగిరి, సి.ఐ అనిల్ కుమార్, ఆర్.ఎస్.ఐలు ఏ.ఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్సిడీ ఎరువులు కొనుగోలకు రైతుల కులమెందుకు?

**-కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ తీరును ఖండించిన అన్బుమణి రాందాస్**

చెన్నై మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సబ్సిడీ ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తమ కులాన్ని చెప్పాలన్న కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖ తీరును పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ఖండించారు. ఈ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అన్బుమణి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ‘వ్యవసాయం కులం ఆధారంగా చేయరు. ఎరువుల సబ్సిడీ కూడా కులప్రాతిపదికన ఇవ్వడం లేదు. అలాంటప్పుడు ఎరువుల సబ్సిడీ కోసం కులం పేరును నమోదు చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. కేంద్రప్రభుత్వ తీరు రైతులను దెబ్బతీసేలా వుంది. కులసంఘాలను సంప్రదించి ఎరువుల సబ్సిడీ ఇవ్వాలని కేంద్రం యోచిస్తోందన్న అనుమానం రైతుల్లో నెలకొని వుంది.

# ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉల్లి సెగ..



అమరావతి, మార్చి 4:వంటకాల్లో తప్పకవాడే ఉల్లి పెరిగిన ధరలతో ఒక సమయంలో ఢిల్లీ పీఠాన్నే కదిలించింది. సాధారణం గా ఆకాశాన్నంటే ధరలతో వినియోగదారులను కంట తడి తెప్పించే ఉల్లి ప్రస్తుతం పాతాళానికి పతనమైన ధరలతో సాగు దారుల కంట కన్నీరు ఒలికిస్తోంది. గతేడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా దేశ వ్యాప్తంగా పంట దెబ్బతిని ఉల్లి ధరలకు రెక్కలు వచ్చాయి. అయితే ఈ ఏడాది ప్రకృతి అనుకూలించడంతో దిగుబడులు పెరిగి ధరలు అమాంతం పడిపోయాయి. ఈ పంటపై ఆధారపడ్డ రైతులు, వ్యాపారులకు ఇప్పుడు కష్టం వచ్చింది. ప్రస్తుతం ధరలు కుప్పకూలి గిట్టు- బాటు- ధరలు లేక రైతులు చేస్తున్న ఆందోళనలు పలు రాష్ట్ర ప్రభుత్వాలకు మింగుడు పడడం లేదు. ఇప్పటికే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఉల్లి రైతుల ఆందోళనకు ప్రతిపక్షాలు మద్దతు తెలపడంతో ఉద్యమం తీవ్ర స్థాయిలో జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఉల్లి సాగు రైతుల ఉద్యమ సెగ ఆంధ్రప్రదేశ్‌ను తాకే అవకాశాలు వున్నట్లు- తెలుస్తోంది. ఏపీలో రాయలసీమ ప్రాంతంలో ఉల్లి సాగు అధికంగా సాగవుతోంది. ప్రధానంగా కర్నూలు మార్కెట్ యార్డులో కిలోకు రూ.4 కు మించి ధరలు పలకక పోవడంతో రైతులు ఆందోళన చేయడం జరిగింది

గిట్టబాటు- ధరలు లేక రైతులు ఉల్లిపాయలను మార్కెట్ యార్డుకు తీసుక రావడంలేదు. సాధారణంగా ఈ సీజనులో రోజుకు 25 నుంచి 30 లారీల సరుకు రావాల్సి వుండగా పడిపోయిన ధరలతో ఖర్చులు కూడా రావనే అనుమానంతో యార్డుకు సరుకులు తీసుకు రావడం లేదు. దీంతో ప్రస్తుతం యార్డుకు కేవలం 10 నుంచి 15 లారీల సరుకులు మాత్రమే వస్తున్నట్లు- చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లికి 2020లో మద్దతు ధర క్వింటా రూ.770 ప్రకటించింది. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయడంలేదు. దీనితో ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఉల్లి రూ.400కు పతనమైంది. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు. దేశ వ్యాప్తంగా ఉల్లి ధర 20 రోజుల వ్యవధిలో సగానికి సగం పడిపోయింది. దేశంలోనే అతిపెద్ద ఉల్లి హోల్‌సేల్ మార్కెట్‌గా పేరుగాంచిన మహారాష్ట్ర లాసల్గావ్, నాసిక్ మార్కెట్‌లలో ఫిబ్రవరి 9వరకు క్వింటాలు ఉల్లి ధర రూ.1000 నుంచి రూ.1100 మధ్య పలకగా, ఈ నెల 27న అది సగటు-న రూ.500 నుంచి రూ.550కి పడిపోయింది. ఒక దశలో కిలో ఉల్లి ధర రూ.4 నుంచి రూ.2కు కూడా పడిపోయింది. ఒక్కసారిగా పడిపోయిన ధరల ప్రభావంతో ఇక్కడి ఉల్లి వ్యాపారులు లబోదిబో అంటు-న్నారు. దీంతో లాసల్గావ్ మార్కెట్లో తమ వ్యాపారాలను బలవంతంగా నిలిపివేశారు. ఇతర మార్కెట్లలో కూడా ఉల్లి వేలం ప్రక్రియను నిలిపివేస్తామని మహారాష్ట్ర ఉల్లి పెంపకందారుల సంఘం తెలిపింది.

మహారాష్ట్రలో ఉల్లి ధరలు తగ్గిపోవడానికి కారణాలు అనేకం:

మహారాష్ట్రలో ఉల్లి ధరలు తగ్గిపోవడానికి కారణాలు అనేకం. ఇందులో ముఖ్యమైనది వాతావరణంలో వచ్చే మార్పులు. సాధారణంగా అక్కడ రైతులు ఉల్లికి సంబంధించి ఏడాదిలో 3 పంటలు పండిస్తారు. ఖరీఫ్లని? జూన్-జులై మధ్యలో వంట నాట్లు- వేసి, సెప్టెంబర్, అక్టోబర్‌లో కోతలు జరుపుతారు. ఖరీఫ్ తర్వాత సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో నాట్లు- వేసి, జనవరి, ఫిబ్రవరిలో.. రబీ సీజన్‌కు సంబంధించి డిసెంబర్ లేదా జనవరిలో నాట్లు- వేసి, మార్చి, ఏప్రిల్లో కోతలు చేపడతారు. పండించిన పంటను ఒకే సారి విక్రయించరు. ఎక్కువగా నగదుకే విక్రయిస్తారు.

ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా దిగజారిన ఉల్లి వ్యాపారులకు మాత్రమే కాదు, రైతులకు కూడా కన్నీళ్లు మిగులుస్తోంది. మార్కెట్లో నిల్వలు పెరిగి, ధరలు భారీగా తగ్గిపోవడంతో వ్యాపారులు రైతులకు కూడా తక్కువ ధరలే చెల్లిస్తున్నారు. ఇటీ-వల షోలాపూర్లో ఓ రైతు 512 కేజీల ఉల్లిని మార్కెటు-?క విక్రయం కోసం తీసుకురాగా, అన్ని ఖర్చులూ పోనూ వ్యాపారి రైతుకు కేవలం 2రూపాయల చెక్కు చేతిలో పెట్టాడు. ఇలాంటి అనుభవాలు అనేక మంది రైతులకు ఎదురవుతున్నాయి. రైతుల నిస్సహాయతను ఆసరా చేసుకుంటు-న్న దళారులు, వ్యాపారులు ధరలను మరింత తగ్గించి నామమాత్రం మొత్తాన్ని రైతు చేతిలో పెడుతున్నారు. రైతులు కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో బాధను దిగమింగుకుంటూ వ్యాపారులు ఇచ్చిన మొత్తాన్ని తీసుకుంటు-న్నారు. భారతదేశంలో ఉల్లి ధరలు రాజకీయాలను కూడా ప్రభావితం చేస్తాయి. ప్రభుత్వాలను కూడా పడగొట్టే స్థాయి ఉల్లిది. 1998లో దేశ రాజధాని దిల్లీలో ఉల్లి ధరల పెరుగుదలతో అప్పుడు జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధికారం కోల్పోయింది. దిల్లీలో బీజేపీకి అప్పుడు చేజారిన అధికారం మళ్లీ ఇంకా దక్కలేదు. ఇక ఉల్లి పంట అధికంగా పండే మహారాష్ట్రలోనూ పలు మార్లు ఉల్లి ధరలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. ధరలు తగ్గినా, పెరిగినా, అది పాలక పక్షాలకు ఇబ్బందిగా, విపక్షాలకు అస్త్రంగా మారుతూ వస్తోంది. తాజాగా ఉల్లి ధరల తగ్గుదల అంశం మహారాష్ట్ర శాసనసభను కుదిపివేసింది. ఉల్లి రైతుల సమస్యలను తెలిపేందుకు ఎన్సీపీ -ఎమ్మెల్యేలు.. అసెంబ్లీ సమావేశాలకు ఉల్లిపాయ బుట్టలతో హాజరయ్యారు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉల్లి ధరలు తగ్గిన నేపథ్యంలో అక్కడి హోల్‌సేల్ వ్యాపారులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. క్వింటాలుకు కనీసం రూ.1000 కచ్చితమైన ధర ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ ధరకు తక్కువగా ఎవరూ కొనుగోలు చేయకుండా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. నాఫెడ్ కూడా పంటను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. దీనిపై నాఫెడ్ కూడా స్పందించింది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఇప్పుడే చర్యలు చేపట్టాలి. నాఫెడ్ కొనుగోలు చేసే రబీ ఉల్లి పంట నుంచి బఫర్ స్టాక్‌ను ఏర్పాటు- చేయాలి. గిట్టు-బాటు- ధరను నిర్ణయించి రైతుకు, వ్యాపారులకు తగిన లాభం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తగిన నిల్వ సౌకర్యాలను ఏర్పాటు- చేయాలి. లేకుంటే ఇప్పుడు మహారాష్ట్రకే పరిమితమైన ఉల్లి సంక్షోభం, రాబోయే రోజుల్లో ఏపీలో రైతులు, వ్యాపారులకు, వినియోగదారులకు కన్నీరు తెప్పించే ప్రమాదం ఉంది. గతంలో ఇదే పరిస్తితి ఎదురైనపుడు ఏపీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ను రంగంలోకి దింపి రైతుల నుంచి కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా వినియగదారులకు విక్రయించడం జరిగింది. ఇదే రీతిలో ప్రస్తుతం కూడా రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ను రంగంలోకి దింపి రైతుల నుంచి కొనుగోలు చేసి ఆదుకోవాలని ఉల్లి సాగుదారులు కోరుతున్నారు.






# 14 నుంచి ఏపి అసెంబ్లీ సమావేశాలు - మూడు రాజధానుల బిల్లుకు అవకాశం..




అమరావతి, మార్చి 4:ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీలో వైకాపా ప్రభుత్వం నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకోబోతోంది. అలాగే మరో రెండు నెలల్లో ఎన్నికల ఏడాదిలోకి ప్రవేశించబోతోంది. ఎన్నికల ఏడాది పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం కూడా ఉండదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కీలకంగా మారాయి. ఈ ప్రభుత్వానికీ ఇవే చివరి బడ్జెట్ సమావేశాలు కానున్నాయి. 14వ తేదీన గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభమవుతాయి. గవర్నర్ ప్రసంగం తర్వాత బీఏసీ సమావేశం

జరుగుతుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ పని రోజులు నిర్ణయిస్తారు. కనీసం పది రోజుల పాటు- సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు- చేస్తోంది. ఇందుకోసం ఇప్పటికే వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలు తెప్పించుకున్న ప్రభుత్వం.. వాటితో బడ్జెట్ పద్దు సిద్ధం చేస్తోంది. వచ్చే ఏడాది ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సంక్షేమ పథకాలకు వైకాప ప్రభుత్వం పెద్ద పీట వేసే అవకాశం ఉంటు-దని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందులోనే మూడు రాజధానుల బిల్లును మరోసారి ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. బడ్జెట్ తో పాటు- పలు కీలక బిల్లుల్ని ఆమోదింపచేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు- చేసుకుంటోంది.

పది రోజులు బడ్జెట్ సమావేశాలు..

మార్చి 14న ప్రారంభమయ్యే ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కనీసం 10 రోజులు జరిగేలా కనిపిస్తున్నాయి. తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యే సెషన్స్.. రెండో రోజు బీఏసీ సమావేశం తర్వాత అజెండా ఖరారు చేసుకుంటాయి. అనంతరం అజెండా ఆధారంగా బడ్జెట్ ఎప్పుడు ప్రవేశపెట్టబోతున్నారనేది తేలిపోనుంది. అనంతరం మరికొన్ని కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టిసారించవచ్చని తెలుస్తోంది. ఎన్నికల బడ్జెట్ గా భావిస్తున్న ఇందులో జగన్ సర్కార్ పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. విశాఖ వేదికగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్‌సమ్మిట్ లో త్వరలో విశాఖ నుంచే పరిపాలన సాగిస్తామని కీలక ప్రకటన చేయడంతో రానున్న బడ్జెట్ సమావేశాల్లో మూడు రాజధానుల బిల్లు మరో మారు అసెంబ్లీ ముందుకు రానున్నట్లు- తెలుస్తోంది. ఏపీలో మూడు రాజధానుల ఏర్పాటు- కోసం రెండు బిల్లుల్ని అసెంబ్లీలో గతంలో ఆమోదించిన ప్రభుత్వం అనంతరం గవర్నర్‌తోనూ ఆమోదముద్ర వేయించుకున్నా న్యాయస్థానాల్లో చుక్కెదురైంది. ఈ విషయం ముందే గ్రహించి బిల్లుల్ని వెనక్కి తీసుకుంది. వాటి స్థానంలో మరింత మెరుగైన బిల్లు తీసుకొస్తామని అప్పట్లో సీఎం జగన్ సభాముఖంగా ప్రకటించారు. ఇప్పుడు ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో మూడు రాజధానుల బిల్లును మరోసారి అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు- ప్రచారం జరుగుతోంది. అయితే సుప్రీంకోర్టులో కేసు నేపథ్యంలో అసెంబ్లీలో మరోసారి బిల్లు పెట్టడంపై న్యాయనిపుణుల సలహా తీసుకుంటు-న్నారు.

# సింహగిరి అభివృద్ధికి కేంద్రం సహకారం : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



అమరావతి, మార్చి 4: దక్షిణ భారతదేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి కేంద్రం నిరంతరం సహకారం అందిస్తుందని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. పెట్టుబడుల సదస్సులో పాల్గొనడానికి నగరానికి వచ్చిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సర్బా నంద్ సోనోవాల్ ను శనివారం సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, విశాఖ అంతర్జా తీయ విమానాశ్రయము సలహా మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీను బాబు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులకు సింహాద్రినాథుడు జ్ఞాపికలు శ్రీనుబాబు బహుకరించారు. సింహగిరి ఆలయ అభివృద్ధికి కేంద్రం నుంచి మరింత తోడ్పాటును అందించాలని శ్రీను బాబు కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ప్రసాద్ స్కీం కింద 54 కోట్లు నిధులు కేంద్రం మంజూరు చేసినట్లు చెప్పారు. వీలైనంత త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని కూడా కేంద్ర మంత్రి సూచించారు. రెండో విడత కూడా మరింతగా నిధులు మంజూరు చేసేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. కేంద్ర పోర్ట్ లు, వాటర్ వేస్ శాఖ మంత్రి సర్బానంద్ సోనో వాల్ ను సత్కరించిన శ్రీను బాబు మాట్లాడుతూ.. డాక్ లేబర్ బోర్డ్ నుంచి పోర్ట్ లో విలీనమైన 347 క్యాజువల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గతంలో కూడా ఇదే విషయం పలుమార్లు విన్నవించినట్లు శ్రీను బాబు వివరించారు.

# నార్కో టెర్రర్ మాడ్యూల్ గుట్టురట్టు..

## –భారీగా ఆయుధాలు, హెరాయిన్, నగదు పట్టివేత

జమ్మూకశ్మీర్ మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): నార్కో టెర్రర్ మాడ్యూల్ పై భద్రతా బలగాలు విరచుకుపడ్డాయి. అక్రమంగా మాదకద్రవ్యాలు, ఆయుధాలు సరఫరా చేస్తున్న స్మగ్లింగ్ ముఠా గుట్టు రట్టు చేశాయి. పూంచ్ జిల్లాలో భద్రతా బలగాల చేపట్టిన గాలింపు చర్యల్లో ఈ నార్కో టెర్రర్ మాడ్యూల్ బయటపడింది. నటోరియస్ డ్రగ్ స్మగ్లర్‌గా పేరున్న రఫీ ధన అలియాస్ రఫీ లాలా అనే వ్యక్తిని ప్రజా భద్రతా చట్టం కింద అరెస్టు చేసి, అతని ఇంటి నుంచి 7 కిలోల హెరాయిన్, రూ.2 కోట్ల నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పూంచ్‌లోని లైన్ ఆఫ్ కంట్రోల్ కు సమీపంలో రఫీ ధన నివసిస్తున్నట్టు చెప్పారు."ఈరోజు మాకు అందిన సమాచారంతో ఇన్స్పెక్టర్ సునీల్ సారథ్యంలోని పూంచ్ టీమ్, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా రఫీ ఇంటిలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ దాడుల్లో 7 కిలోల హెరాయిన్, రూ.2 కోట్ల నగదు, ఒక పిస్టోల్, ఒక మ్యాగజైన్, ఏడు రౌండ్ల ఎస్‌ఎల్‌ఆర్ సహా 10 రౌండ్లు స్వాధీనం చేసుకున్నాం. మెజిస్ట్రేట్, పలువురు స్థానిక ప్రముఖుల సమక్షంలో సోదాలు కొనసాగుతున్నాయి" అని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. పట్టుబడిన టెర్రర్ మాడ్యూల్‌కు, పంజాబ్‌కు చెందిన నార్కోటిక్స్ స్మగ్లర్లకు ఉన్న సంబంధాలపై విచారణ జరుపుతున్నామని, మండి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశామని చెప్పారు. ఇటీవల కాలంలో సరిహద్దు ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల స్మగ్లింగ్ పెరుగుతున్నట్టు రిపోర్ట్‌లు చెబుతున్నాయి. ప్రధానంగా పాకిస్థాన్ నుంచి మాదకద్రవ్యాలు, ఆయుధాల సరఫరా జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇందుకోసం స్మగ్లర్లు డ్రోన్లను ఉపయోగిస్తున్నట్టు కూడా బలగాలు గుర్తించాయి.

# హాథ్ సే హాథ్ జోడో యాత్రకు సిద్ధమవుతున్న ఎంపి ఉత్తమ్ కుమార్

హైదరాబాద్, మార్చి 4:హైదరాబాద్ పారిశ్రామికవేత్త అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోడీ అదానీ కంపెనీలకు లాభం చేకూర్చి.. బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా లబ్ది చేకూర్చారని ఉత్తమ్ ఆరోపించారు. గాంధీభవన్ ప్రాంగణంలోని ప్రకాశం హాల్లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్?పై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఏఐసీసీ ఇంఛార్జ్ మాణిక్?రావు ఠాక్రే, జోడో యాత్ర ఇంఛార్జ్ గిరీష్ చోడెంకర్, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావిద్, రోహిత్ చౌదరి, చిన్నారెడ్డి తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లాల వారీగా హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమాల తీరుపై సమీక్షించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ, భారతదేశం సెక్యులర్ దేశంగా ఉండాలని కోరుకుంటుందని కాని బీజేపీ మాత్రం దేశాన్ని మతపరంగా విభజించి రాజకీయ లబ్ది పొందుతుందని రెడ్డి మండిపడ్డారు. తాను కూడా రేవంత్ పాదయాత్రలో పాల్గొంటానని పేర్కొన్నారు..

# శ్రీపాద కాలువ పనులు గాలికి వదిలేశారు-మండిపడ్డ రేవంత్ రెడ్డి



రాజన్న సిరిసిల్ల మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):శ్రీపాద 9వ ప్యాకేజి కాలువను రేవంత్ రెడ్డి సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న కాలువను పరిశీలించారు. కాలువ పనులు పూర్తి చేయకపోవ డానికి కారణాలపై అధికారులను ఫోన్ ద్వారా ప్రశ్నించారు.

పనుల జాప్యంగా అధికారులను ప్రశ్నించారు. అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ... శ్రీపాద కాలువ పనులు గాలికి వదిలేశారని మండిపడ్డారు. కడప జిల్లా (కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాన్నారు. లాభాలు దండుకుని, మిగిలిన పనులను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఆలస్యం కావడానికి , అంచనా వ్యయం పెరగటానికి కారణమైన సంస్థ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడి ప్రాంత రైతులపై ఆ కాంట్రాక్టర్లకు ప్రేమలేదన్నారు. మంత్రి కేటీఆర్ కాంట్రాక్టర్లకు లొంగిపోవడం వల్లే పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. కమిషన్ల కక్కుర్తితో కేటీఆర్ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. తక్షణమే 9వ ప్యాకేజి పనులు పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కు పెనుప్రమాదం

రాజన్న సిరిసిల్ల మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కు పెనుప్రమాదం తప్పింది. శనివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాదయాత్రలో భాగంగా రేవంత్ శ్రీపాద ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరి వెళ్లారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి కాన్వాయ్ లో కార్లు ప్రమాదవశాత్తు వరుసగా ఢీకొట్టుకున్నాయి. అతి వేగం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదం జరిగిన వెంటనే కాన్వాయ్‌లోని బెలూన్లు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో నాలుగు కార్లు ధ్వంసమయ్యాయి. పలు మీడియా కార్లకూ ప్రమాదం చోటు చేసుకుంది. కాగా... ఎవరి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం రేవంత్ వేరే కారులో శ్రీపాద ప్రాజెక్ట్ సందర్శనానికి వెళ్లారు.




# కోవిడ్ ఆనవాళ్ల గురించి చెప్పండి : డబ్ల్యూహెచ్‌వో

జెనీవా, మార్చి 4:చైనాలో ఉన్న వుహాన్ ల్యాబ్ నుంచే కోవిడ్ వైరస లీకైనట్లు ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆ వాదనలు మళ్లీ బలం పుంజుకున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ(చిఊూ) కీలక ప్రకటన చేసింది. కోవిడ్19 ఆనవాళ్ల గురించి ఎటువంటి సమాచారం తెలిసినా.. ఆ విషయాన్ని తమతో పంచుకోవాలని ప్రపంచ దేశాలను డబ్ల్యూహెచ్‌వో కోరింది.

వుహాన్ ల్యాబ్ నుంచి కోవిడ్ లీకైనట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, ఎఫ్‌బీఐ వద్ద దీనికి సంబంధించిన సమాచారం ఉందని డైరక్టర్ క్రిస్టోఫర్ వ్రే తెలిపారు. 2019లోనే తొలిసారి చైనా నగరం వుహాన్ నుంచి వైరస్ లీకైనట్లు అనుమానాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే తాజాగా ఎఫ్‌బీఐ చేసిన ఆరోపణలను చైనా అధికారులు ఖండించారు. తమ దేశంపై అమెరికా అసత్యాలు ప్రచారం చేస్తున్నట్లు డ్రాగన్ ఆరోపించింది.

ఎఫ్‌బీఐ రిపోర్టు నేపథ్యంలో డబ్ల్యూహెచ్‌వో డైరక్టర్ జనరల్ టెడ్రోస్ అథనమ్ గేబ్రియాసిస్ స్పందించారు. ఏ దేశం వద్దనైనా కోవిడ్ ఆనవాళ్లకు సంబంధించిన సమాచారం ఉంటే, దాన్ని డబ్ల్యూహెచ్‌వోకు ఇవ్వాలని టెడ్రోస్ కోరారు. కోవిడ్ మహమ్మారి ఆనవాళ్లను గుర్తించే పనిలో డబ్ల్యూహెచ్‌వో ఉన్నట్లు కూడా ఆయన చెప్పారు.

చైనా అధికారులతో పలుమార్లు చర్చించినట్లు కూడా టెడ్రోస్ తెలిపారు. కోవిడ్ గురించి ఎటువంటి డేటా ఉన్నా షేర్ చేయాలని చైనాను కోరినట్లు టెడ్రస్ చెప్పారు.

# ప్రజలకు నిరంతరం వైద్యసేవలు అందేలా చర్యలు: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



హైదరాబాద్, మార్చి 3:ప్రజలకు నిరంతరం వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాచారంలో హెచ్‌ఎంటి నగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీవాసులు కంటి వెలుగు కేంద్రాలలో కంటి పరీక్షలు చేయించుకొని, తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి కంటి అద్దాలను ఉచితంగా అందజేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం తగిన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించిన సీఎం కేసీఆర్ వారికి అన్నిరకాల సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నారని చెప్పారు.

వైద్యసేవల కోసం బస్తీ దవఖానాలు, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడంతోపాటు, సీఎం రిలీఫ్‌ఫండ్, కంటి వెలుగు కేంద్రాలు, పీహెచ్‌సీలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకారం అందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గ ప్రజల కోసం పలు ప్రాంతాల్లో బస్తీ దవాఖానల ఏర్పాటు, పీహెచ్‌సీల అభివృద్ధి చేశామన్నారు. వైద్యులను అందుబాటులో ఉండేవిధంగా చూస్తున్నామని, ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, కోటేశ్వర్‌రావు, జనార్దన్‌రావు, కిరణ్, యాదగిరిరెడ్డి, నరసింహ, నేతలు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, సుగుణాకర్‌రావు, కట్ట బుచ్చన్న, శ్రీరాం సత్యనారాయణ, బొట్టు యాదగిరి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బోగ ప్రకాశ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన..

ఉప్పల్‌లోని లక్ష్మినగర్‌లోని కంటి వెలుగు కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కంటి వెలుగు కేంద్రంలో అందుతున్న సేవలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అదేవిధంగా రికార్డులు పరిశీలించి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో 48 మందికి పరీక్షలు నిర్వహించామని, 15 మందికి కంటి అద్దాలు అం దించామని పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడు తూ.. కంటి వెలుగు కేంద్రాలలో ప్రతి ఒక్కరికి వైద్యసేవలు సక్రమంగా అందేలా చూస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాలలో ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

హబ్సిగూడ డివిజన్ నందవనం కాలనీలో వీధిదీపాలు, డ్రైనేజీ, మ్యాన్ హోల్స్‌పై కప్పులు, మూత లు వేయించాలని కోరుతూ శుక్రవా రం కాలనీ వాసులు రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లోకేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎద్దు కృష్ణ, అభితేజ్, నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ? రామంతాపూర్, మార్చి 3

# మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అరెస్టు

బెంగళూరు మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: లంచం కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు పట్టుబడటం కర్ణాటక రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పుట్టించింది. కాంగ్రెస్ పార్టీ నిరసనలకు దిగింది. బీజేపీ ఎమ్మెల్యే మాదల్ విరూపాక్ష ను అరెస్టు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు భారీఎత్తున ఆందోళనకు దిగడంతో ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సహా పలువురుని పోలీసులు అరెస్టు చేశారు.రూ.40 లక్షలు లంచంగా తీసుకుంటూ విరూపాక్ష కుమారుడు ప్రశాంత్ మాదల్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం, ఆ వెనువెంటనే ఆయన ఇంటిలో లోకాయుక్త సిబ్బంది జరిపిన దాడుల్లో రూ.6 కోట్లకు పైగా లెక్కల్లో చూపించని సొమ్ము శుక్రవారం పట్టుబడటం సంచలనమైంది. బెంగళూరు వాటర్ సప్లయి అండ్ సెవరేజ్ బోర్డు చీఫ్ అకౌంటెంట్‌గా ఉన్న ప్రశాంత్ కర్ణాటక సోప్ అండ్ డిటర్జెంట్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) కార్యాలయం కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.

మైసూర్ శాండిల్ సోప్ తయారీదారులైన కేఎస్‌డీఎల్‌కు చైర్మన్‌గా మాదల్ విరూపాక్ష ఉన్నారు.రాష్ట్రంలో 40 శాతం కమిషన్ ప్రభుత్వం పని చేస్తోందంటూ కాంగ్రెస్ గత కొంత కాలంగా పోరాటం చేస్తోంది. తాజాగా రూ.40 లక్షలు తీసుకుంటూ ఎమ్మెల్యే కుమారుడు పట్టుబడటం తమ వాదనకు బలం చూకూరుస్తోందంటూ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుప్పించారు. "రాష్ట్రంలో తీవ్ర అవినీతి జరుగుతోందని, కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమిషన్ అడుగుతున్నారని మేము ఎప్పుడు చెప్పినా ప్రభుత్వం ఆధారాలివ్వమని అడుగుతోంది. ఎమ్మెల్యే కొడుకు 40 శాతం కమిషన్ తీసుకుంటూ పట్టుబడటం ఆధారం కాదా?'' అని మాజీ సీఎం సిద్ధరామయ్య నిలదీశారు. ఇదే విషయాన్ని నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే రామలింగా రెడ్డి నిలదీశారు. కుంభకోణాలు, అవినీతి రాష్ట్రంలో అప్రహతిహతంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వం మాత్రం సాక్ష్యాలు అడుగుతోందని, ఇదే సాక్ష్యమని, ముఖ్యమంత్రి బొమ్మై రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశాన్ని రద్దు చేయాలి

## –మళ్లీ హైకోర్టును ఆశ్రయించిన బహిష్కృత నేత, ఒ.పన్నీర్‌సెల్వం

చెన్నై మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గత జూలై 11న జరిగిన అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆ పార్టీ బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయనకు ఆదిలోనే చుక్కెదురైంది. ఆ సమావేశంలో చేసిన తీర్మానాలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. అన్నాడీఎంకే) సర్వసభ్య సమావేశం గత ఏడాది జూలై 11వ తేదీన జరగ్గా, తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామిఎంపికైన విషయం తెలిసిందే. అలాగే ఓపీఎస్ సహా ఆయన మద్దతుదారులను పార్టీ నుంచి తొలగించారు. దీంతో సర్వసభ్య మండలి తీర్మానాలను వ్యతిరేకిస్తూ ఓపీఎస్ తరపున దాఖలైన పిటిషన్లపై మద్రాస్ హైకోర్టు తీర్పులు ఇచ్చిన విషయం తెలిసిందే. అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశ తీర్మానాలు చెల్లవని సింగిల్ జడ్జి తీర్పు వెలువరించగా, ఆనక ద్విసభ్య ధర్మాసనం ఆ సమావేశ తీర్మానాలు చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది. దాంతో ఆ తీర్పును సవాల్ చేస్తూ ఓపీఎస్ వర్గీయులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారించిన అత్యున్నత న్యాయస్థానం, అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం చెల్లుబాటవుతుందని స్పష్టం చేస్తూ, అయినా ఆ తీర్పును వ్యతిరేకిస్తూ హక్కుల పిటిషన్ దాఖలు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అందుకు మద్రాసు హైకోర్టునే ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం రద్దు చేయాలని కోరుతూ ఓపీఎస్ తరపున ఎమ్మెల్యే మనోజ్ పాండ్యన్ మద్రాసు హైకోర్టులో కొత్త పిటిషన్ దాఖలుచేశారు. గత ఏడాది జూలై 11వ తేది నిర్వహించిన సర్వసభ్య మండలి సమావేశంలో ఒ.పన్నీర్‌సెల్వం, వైద్యలింగం, జేసీడీ ప్రభాకర్, తనతో పాటు పలువురు నిర్వాహకులను పార్టీ నుంచి తొలగించడంతో పాటు తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా పళనిస్వామిని ఎంపిక చేస్తూ తీర్మానించారని పిటిషన్‌లో తెలిపారు. అలాగే, సమన్వయకర్త, ఉప సమన్వయకర్త పదవులను కూడా తొలగిస్తూ తీర్మానం నెరవేర్చారని పేర్కొన్నారు. ఈ తీర్మానాలపై స్టే విధించాలని ఎమ్మెల్యే మనోజ్ పాండ్యన్ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ శుక్రవారం మద్రాసు హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ రామమూర్తి ముందు విచారణ జరిగింది. మనోజ్ పాండ్యన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గురు కృష్ణన్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పుతో తాము శాసనసభ సమావేశాల్లో పాల్గొనలేని పరిస్థితి నెలకొందని, అందువల్ల తక్షణం ఆ తీర్మానాలపై స్టే విధించాలని అభ్యర్థించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ, ప్రతివాదుల తరఫు వాదనలు వినయకుండానే తీర్మానాలపై ఎలా స్టే విధిస్తామని ప్రశ్నించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సర్వసభ్య మండలి తీర్మానాలపై స్టే విధించలేమని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదావేస్తున్నట్లు ప్రకటించారు. ఈ లోపు పళనిస్వామి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

# ఒత్తిడి, మానసిక అశాంతి దూరానికి అత్యుత్తమ మెడిసిన్ యోగ : మంత్రి ఎర్రబెల్లి

హనుమకొండ, మార్చి 4:మానసిక ఒత్తిడి, అశాంతిని దూరం చేసేందుకు యోగ(ఎనీఐజీ) అత్యుత్త మెడిసిన్‌గా పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో హార్ట్ ఫుల్ నెస్, శ్రీ రామ చంద్ర మిషన్, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగ మహోత్సవ్ ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మానవ జీవితంలో ఒత్తిడి సర్వ సాధారణంగా మారిందని అన్నారు. ఒత్తిడిని జయించడానికి మందులు, మాకుల కంటే యోగా సాధన మంచి మార్గమని పేర్కొన్నారు. యోగా ఫలితాలను అందిస్తూ, ప్రపంచ శాంతి కోసం రామచంద్ర మిషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ ఉత్సవాలకు ప్రపంచంలోనే ప్రముఖ గ్రంథ కర్త, ఆధ్యాత్మిక యోగ గురువు రామచంద్ర మిషన్ కమలేశ్ డి పటేల్.. దాదాజీ రావడం అదృష్టమరి వెల్లడించారు. వారి కోరిక మేరకు పర్వతగిరిలో యోగ ధ్యాన కేంద్రం ఏర్పాటుకు 200 ఎకరాల స్థలం స్వచ్ఛందంగా ఇచ్చామని వివరించారు.

వరంగల్ జిల్లా ప్రజలకి అందుబాటులో ఉండే విధంగా ఈ యోగ ధ్యాన కేంద్రాన్ని నిర్మించబోతున్నామని అన్నారు. దాదాజీ మాట్లాడుతూ జీవన విధానం యోగాలో ప్రాణాయామం చాలా ముఖ్యమైనదని అన్నారు.




యోగాలో అష్టాంగ యోగా లో యమ నియమాలు గురించి తెలుసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్, సీపీ, కమిషనర్, ఇతర ప్రజా ప్రతినిధులు బ్యాడ్మింటన్ జాతీయ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్, మంత్రి దయాకర్ రావు సతీమణి, ఎర్రబెల్లి ట్రస్టు చైర్ పర్సన్ ఉషా దయాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# టిడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రథమ మహా సభను విజయవంతం చేయాలి

## - బాలాజీ నాయక్ టిడబ్ల్యూజేఏ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు

మహబూబాబాద్, మార్చి 4:(నేటినిజం ప్రతినిధి): టిడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రథమ మహా సభను విజయవంతం చేయాలని టిడబ్ల్యూజేఏ మహబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. మార్చి 5వ తేదీన ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్నా మొదటి రాష్ట్ర మహా సభను జిల్లా కేంద్రంతో పాటు తోర్రుర్ డివిజన్, వివిధ మండలలో పనిచేస్తున్న గిరిజన జర్నలిస్ట్ సహోదరులు ప్రతి ఒక్కరు పాల్గోని విజయవంతం చేయాలని కోరారు.

# క్యాబ్ ఓనర్‌కు 'టిస్వా' ఆర్థిక సహాయం



హైదరాబాద్ మార్చ్ 4 :ఆర్కేఎస్ కూకట్‌పల్లి నిర్వహించే ఆర్టిఓ ద్వారా అనుమతి ఆలస్యం మూలంగా నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా 1,000 00/– క్లెయిమ్ తిరస్కరించబడిన ఎస్. దినేష్ అనే టూ09జః 7846క్యాబ్ ఓనర్ కు తెలంగాణ ఇన్సూరెన్స్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(టిస్వా) 50 శాతం , ఆర్థిక సహాయాన్నిఅందించింది. దళిత్ బంధ్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన దినేష్ ఖీూ ద్వారా అనుమతి ఆలస్యం మూలంగా నేషనల్ ఇన్సూరెన్స్ ద్వారా 1,00000/– క్లెయిమ్ తిరస్కరించింది. వాహనం వారి జీవనోపాధికి మాత్రమే మూలం.అతని దయనీయ స్థితిని దృష్టిలో ఉంచుకుని టిస్వా ప్రెసిడెంట్ గుర్రం నర్సింలు స్పందించి పైన పేర్కొన్న అన్ని కారణాలను దృష్టిలో ఉంచుకుని, టిస్వా రెస్యూకి వచ్చిన వ్యక్తికి తిరస్కరించబడిన 1లక్ష క్లెయిమ్ మొత్తంలో 50% మద్దతును అందించారు. ఈ కార్యక్రమం లో వెంకట్ రాం రెడ్డి,జాన్సన్ జయకుమార్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, వేంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.



సంగారెడ్డి మార్చి 4 (నేటి నిజం ప్రతినిధి) ఈ నెల 6న జిల్లాలో రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు పర్యటించనున్న నేపథ్యంలో సంగారెడ్డి కేంద్రంలో మంత్రి పాల్గొననున్న వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శరత్ శనివారం పరిశీలించారు.ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి,మెడికల్ కళాశాల,తారా డిగ్రీ కళాశాల, ఓల్డ్ డి ఆర్ డి ఎ, సమీకృత కలెక్టరేట్ లో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.

ఆయా కార్యక్రమాలకు సంబంధించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.రేపటిలోగా ఏర్పాట్లన్ని పూర్తి చేయాలన్నారు. మంత్రి పర్యటన విజయవంతం అయ్యేలా అధికారులందరూ తమకు కేటాయించిన పనులను సమర్ధవంతంగా చేయాలన్నారు.

కలెక్టర్ వెంట ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావ్, డి ఎఫ్. ఓ శ్రీధర్ రావ్,డి.పి. ఓ.సురేష్ మోహన్,ఆయా శాఖల అధికారులు, ఆర్డిఓ,తదితరులు పాల్గొన్నారు.

# 8 న సాహితి జిగీష సాహిత్య,సంస్కృతిక సంస్థ అధ్వర్యంలో మహిళా దినోత్సవం

హైదరాబాద్ మార్చ్ 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సాహితి జిగీష సాహిత్య,సంస్కృతిక సంస్థ మరియు శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 8న మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సాహితి జిగీష సంస్థ అధ్యక్షులు బండారుపల్లి రామచంద్రారావు, ఉపాధ్యక్షులు రఘు శ్రీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లలిత వాణి నేడు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ బుధవారం సాయంత్రం 5:30 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభ లో గల గుండవరపు హనుమంతరావు కళావేదికలో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాకర భారతి, విశిష్ట అతిథులుగా వివిఎస్ జనార్ధన్ మూర్తి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. బోయి హైమావతి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ప్రో.పివి ఉమా శశి ఆత్మీయ ప్రసంగాన్ని చేసునట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పి విజయలక్ష్మి, ఎం భారతి, బి దివ్య, పి స్రవంతి, జి పద్మావతి, వి నాగరత్నాలను సన్మానించనున్నట్లు వారు వివరించారు






# దేశమంతా మార్పు గాలులు వీస్తున్నాయ్.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయం

ముంబై, మార్చి 4: దేశమంతటా మార్పు గాలులు వీస్తున్నాయని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమని రాజకీయ కురువృద్ధుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్‌పవార్ వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని పుణె నగరంలోగల కస్బా పెత్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట. గత 28 ఏండ్లుగా బీజేపీ అక్కడ విజయం సాధిస్తూ వస్తున్నది. అయితే, ఇటీవల ఆ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోరం పరాజయం మూటగట్టుకుంది. అక్కడ ప్రతిపక్ష మహాకూటమి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించాడు.

ఈ విషయంపై మీడియా ప్రతినిధులు శరద్‌పవార్‌ను ప్రశ్నించగా.. దేశమంతా బీజేపీకి వ్యతిరేకంగా మార్పు గాలులు వీస్తున్నాయనడానికి కంచుకోట లాంటి కస్బా పెత్‌లో ఆ పార్టీ ఓటమే నిదర్శనమని అన్నారు. ఈ ఫలితంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే విషయం స్పష్టమైందని చెప్పారు. కాగా, ప్రస్తుతం పుణె పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న గిరీష్ బపట్.. కస్బా పెత్ అసెంబ్లీ స్థానంలో 2019 వరకు వరుసగా ఐదు పర్యాయాలు గెలుపొందారు.

దేశవ్యాప్తంగా కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ అన్ని రాష్ట్రాలను బీజేపీ నిర్లక్ష్యం చేసిందని పవార్ ఆరోపించారు. అంతేగాక వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ ఎలా కూలదోసిందో కూడా ప్రజలు గమనించారని, అవన్నీ దృష్టిలో ఉంచుకుని ప్రజలు బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నారని అన్నారు.

# హిందుత్వానికి ఏ ఒక్కరూ ఛాంపియన్ కాదు : మంత్రి జగదీష్ రెడ్డి

నల్లగొండ, మార్చి 4: హిందుత్వానికి ఏ ఒక్కరూ ఛాంపియన్ కాదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. హిందుత్వాన్ని రాజకీయాల్లోకి దూర్చి కొందరు హిందుత్వ గౌరవాన్ని దిగజారుస్తున్నారని ఆయన మండిపడ్డారు. చెట్టుపేరు చెప్పుకుని కాయలు అమ్మే వారు ఇటువంటి కుట్రలకు తెర లేపుతున్నారని ఆయన దుయ్యబట్టారు. శనివారం సాయంత్రం నల్లగొండ జిల్లా కేంద్రంలోనీ వేద పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం, దేవాలయ దీప, ధూప మత్తెక అర్చక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ శోభాక్రుత్ కాల నిర్ణయ పంచాంగాన్ని మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు.

అనంతరం జరిగిన సభలో మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ విలువలు అంటేనే హిందుత్వానికి ప్రతీక అని ఆయన కొనియాడారు. వేల సంవత్సరాల నుండే ఇది విరాజిల్లుతుందన్నారు. మానవ సమాజం మొదలైన రోజు నుండే భారతదేశంలో విలువలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. పాశ్చాత్య పోకడలు పోయిన వారు కుడా కాల క్రమంలో సనాతన హిందు విలువలకు పెద్ద పీట వేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నక్షత్రాలలో జరుగుతున్న మార్పులను పట్టే పంచాంగం రూపొందించడం భారతీయ సమాజంలో అనాదిగా వస్తుందాన్నారు. వాటిని శాస్త్రీయంగా అధ్యయనం చేసిన మీదటనే కాల నిర్ణయంతో పాటు భూత భవిష్యత్ వర్తమాన కాలాలను నిర్దేశిస్తారన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో ఇక్కడ వేదపాఠశాల నెలకొల్పడం జరిగిందన్నారు. శాశ్వతమైన భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలా చారి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌కు బదిలీ అయిన డీఈవో రాధాకిషన్ కు ఆత్మీయ సత్కారం




రాజన్న సిరిసిల్ల, మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): జిల్లా విద్యాధికారిగా పనిచేసి, మెదక్ జిల్లాకు బదిలీ అయిన రాధాకిషన్ ను ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సత్కారం ఏర్పాటుచేశారు.

దీనికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ– రాఘవ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందనీ కళ చక్రపాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అకునూరి శంకరయ్య, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ లు హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో డీఈవో రాధాకిషన్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడు ఉన్నత విద్యావంతుడు కావాలి..



–ఉన్నత విలువలతో విద్యా ప్రమాణాలు..సకల వసతులతో ప్రభుత్వ పాఠశాలలు..
–ఇంగ్లీష్ మీడియంలో విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం.
–మన బస్తి మన బడి కార్యక్రమంలో మంత్రి పువ్వాడ

ఖమ్మం మార్చి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);.పాఠశాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన పథకం మన ఊరు–మన బడి/మన బస్తి–మన బడి అని అందులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అన్ని మౌళిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడం జరిగిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు.మన బస్తి – మన బడి కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 53వ డివిజన్ ఔఖ క్యాంప్ లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ. 57.38 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26,065 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలో చదువుతోన్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, నమోదు, హాజరుతో పాటు వారు తమ పాఠశాల విద్యను ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగించేందుకు వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి పేదవాడి ఉన్నత విద్యను ఉచితంగా అభ్యసించి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. ఖమ్మం నగరంలో ఇంకా 16 ప్రభుత్వ పాఠశాలలో పనులు కొనసాగుతున్నాయని అతి త్వరలో వాటిని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని హామి ఇచ్చారు.ఇప్పటికే నిర్దేశించిన పాఠశాలలు పూర్తి అయ్యాయని, అందులో విద్యార్థులు అద్భుతంగా విద్యను అందుకుంటున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారని, ఇంగ్లీష్ విద్యను అందించడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.ఇటీవలే కాలంలో ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ కొరకు తనకు విజ్ఞప్తులు పెరుగుతున్నాయని, ఆయా తల్లిదండ్రులు తమ పిల్లలకు పాఠశాలలో అడ్మిషన్ కోసం అడిగినపుడు మనసుకు చాలా సంతోషంగా అనిపిస్తుంది అని అన్నారు. దశల వారీగా డిజిటల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోందని, దీనికోసమే మన ఊరు–మన బడి/మన బస్తి–మన బడి పథకాన్ని తీసుకొచ్చి అమలు చేస్తోందన్నారు.దశల వారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ, స్కూళ్లలో 12 రకాల మౌలిక సదుపాయల కల్పనకు పటిష్ట చర్యలు చేపట్టామని, గ్రామీణ ప్రాంతాలలో ఈ స్కీమ్‌ను మన ఊరు–మన బడి పేరుతో అమలు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాలలో మన బస్తి–మన బడి పేరుతో అమలు చేస్తున్నామన్నారు.ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకే తెలంగాణ ప్రభుత్వం విద్యావ్యవస్థ పై అత్యధికంగా నిధులు వెచ్చించిందన్నారు. తొలుత ప్రభుత్వ, స్థానిక సంస్థలకు చెందిన పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, ఆయా పాఠశాలలో నీటి సౌకర్యంతో పాటు టాయిలెట్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బందికి సరిపడే ఫర్నీచర్ అందించడం, పాఠశాలలు మొత్తం నవీకరించడం, మరమ్మత్తులు చేయడం, కిచెన్లు ఏర్పాటు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త క్లాస్ రూలు ఏర్పాటు చేయడం, డిజిటల్ విద్య వంటి వాటిని అమలు చేస్తోందన్నారు.జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో బీజేపీ పాలన అధ్వాన్నం : మంత్రి ఎర్రబెల్లి



అమరావతి, మార్చి 4:తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశంలో మరెక్కడా అమలు కావడం లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాధవురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ. 22 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, డబుల్ బెడ్ రూం(ఆనీబీఎశ్రీవ ఃవట ఖీనీనీఎ) ఇండ్ల సముదాయానికి శంకుస్థాపన చేశారు.

మంత్రి మాట్లాడుతూ 75 ఏళ్లలో కాని పనులు ఈ ఏడేళ్లలో నే జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిలిండర్ ధరను రూ.400 నుంచి రూ. 1250కు వరకు పెంచిందని విమర్శించారు. దేశంలో బీజేపీ పాలన అధ్వాన్నంగా ఉందని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా, పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్ రూం ఇండ్లు, అనేక పథకాలు అమలు అవుతున్నాయని వెల్లడించారు. విద్యా, వైద్యం కోసం సీఎం కేసీఆర్‌ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రూ. 7 వేల కోట్లతో మూడు విడతలుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూల్స్ కంటే గొప్పగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నసీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని గ్రామస్థులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగవుతున్నాయని , పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రజా ప్రతినిధులు, డీఈవో రాము, డీఆర్‌డీవో రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ యువజన ఉత్సవాలను పంజాబ్‌లోని రోపర్ ఐఐటీ నుంచి ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, మార్చి 4:యువ ఉత్సవ్– ఇండియా ఏ 2047 జాతీయ యువజన ఉత్సవాలను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, సమాచార ప్రసార శాఖ మంత్రి శ్రీ అనురాగ్ ఠాకూర్ ఈ రోజు ప్రారంభించారు. పంజాబ్ లోని రోపర్ ఐఐటీ నుంచి ప్రారంభించిన శ్రీ ఠాకూర్ యువ ఉత్సవ్ డాష్ బోర్డు కూడా ప్రారంభించారు.

యువ ఉత్సవ ఏకకాలంలో ప్రతాప్‌గఢ్ (యు.పి.), హరిద్వార్ (ఉత్తరాఖండ్), ధార్ , హోసంగాబాద్ (ఎం.పి.), హనుమాన్‌గఢ్ (రాజస్థాన్), సరైకేలా (జార్ఖండ్), కపుర్తలా (పంజాబ్), జల్గావ్ (మహారాష్ట్ర), విజయవాడ (ఆంధ్ర ప్రదేశ్). కరీంనగర్ (తెలంగాణ), పాలఖడ్ (కేరళ), కడలూరు (తమిళనాడు)లో ప్రారంభమైంది. . మొదటి దశలో 31 మార్చి 2023 నాటికి దేశవ్యాప్తంగా 150 జిల్లాల్లో యువశక్తిని పురస్కరించుకుని యువ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ప్రారంభ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువతీ యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడిన శ్రీ ఠాకూర్ దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి స్వాతంత్ర్య సమరయోధులు చేసిన పోరాటం, వారు చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశానికి సేవ చేసి యువత స్వాతంత్ర్య సమరయోధులు గర్వించేలా చేయాలని కోరారు. " ప్రపంచంలోనే అతిపెద్ద యువ–శక్తి భారతదేశంలో ఉంది. యువతలో దాగి ఉన్న శక్తి, సామర్థ్యాన్ని వెలికి తీయాలి ." అని శ్రీ ఠాకూర్ అన్నారు.' విద్యార్థులు తమ హృదయానికి దగ్గరగా ఉండే ఒక సామాజిక అంశాన్ని ఎంచుకుని సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి కృషి చేయాలి' అని సూచించిన శ్రీ ఠాకూర్ "యువత రేపటి దేశ నిర్మాతలు" అని అన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యత, ప్రాధాన్యతను శ్రీ ఠాకూర్ వివరించారు. 'చిరుధాన్యాల వల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది. నీటి వినియోగం తగ్గుతుంది. భూసారాన్ని రక్షించడానికి వీలవుతుంది.' అని శ్రీ ఠాకూర్ అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని శ్రీ ఠాకూర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. మంత్రి ఇచ్చిన పిలుపుకు స్పందించిన సభికులు "ఫిట్‌నెస్ కా డోజ్, ఆదా ఘంటా రోజ్ "అంటూ ప్రతిస్పందించారు.

"నేడు పెద్ద సంఖ్యలో అంకుర సంస్థలు ( స్టార్టప్) కలిగి ఉన్న దేశాల జాబితాలో భారతదేశం 3వ స్థానంలో ఉంది. దేశంలో 107 యునికార్న్లు పనిచేస్తున్నాయి. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో అంకుర సంస్థలు ఏర్పాటు అవుతున్న దేశంగా భారతదేశం గుర్తింపు పొందింది. ఒకప్పుడు బలహీన ఆర్థిక వ్యవస్థ గల దేశంగా గుర్తింపు పొందిన భారతదేశం నేడు ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న 5వ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించింది. స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేసిన కృషి, అమలు చేసిన కార్యక్రమాల వల్ల ఇదంతా సాధ్యమైంది" అని శ్రీ ఠాకూర్ అన్నారు.

మొదటి దశ యువ ఉత్సవ్ కార్యక్రమాలను ఆయా జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తాయి. కార్యక్రమాల్లో ఎన్ వై కె ఎస్ అనుబండి క్లబ్బులు, యూత్ క్లబ్ సభ్యులతో పాటు వాలంటీర్లు, పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు, సమీప ప్రాంతాలకు చెందిన విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొంటారు. యువజన వ్యవహారాలు,క్రీడల మంత్రిత్వ శాఖ తన ప్రధాన యువజన సంస్థ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఔజఐూ) ద్వారా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో "యువ ఉత్సవ్ –ఇండియా ఏ2047" కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో జరిగే యువ ఉత్సవ్ కార్యక్రమాలు మూడు దశల్లో జరుగుతాయి. దీనిలో భాగంగా మొదటి దశలో 2023 మార్చి నుంచి జూన్ వరకు జిల్లా స్థాయిలో ఒక రోజు కార్యక్రమాలు జరుగుతాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2023 మార్చి 4 నుంచి 31 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొంటారు రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు ఆయా రాష్ట్రాల రాజధానుల్లో 2023 ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు 2 రోజుల పాటు జరుగుతాయి. అన్ని రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన విజేతలు 2023 అక్టోబర్ 3/4 వ వారంలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యువ ఉత్సవ్‌లో పాల్గొంటారు.

మూడు స్థాయిలలో యువ కళాకారులు, రచయితలు, ఫోటోగ్రాఫర్లు, వక్తలు పోటీ పడతారు. సాంప్రదాయ కళాకారులు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే విధంగా ప్రదర్శనలు ఇస్తారు. 5 లక్ష్యాలు సాధించేలా ఈ ఏడాది యువ ఉత్సవ్ కార్యక్రమాలు జరుగుతాయి. కార్యక్రమంలో పాల్గొనే వారు 5 లక్ష్యాలను అమృత కాలంలో సాధించడానికి అనుసరించాల్సిన ప్రణాళికపై తమ అభిప్రాయాలు వెల్లడిస్తారు. ఇండియా ఏ 2047 సాధన కోసం జరుగుతున్న ప్రయత్నాల్లో యువతను భాగస్వామ్యులను చేయడం లక్ష్యంగా 75 సంవత్సరాల స్వాతంత్ర్య ఉత్సవాల్లో భాగంగా యువ ఉత్సవ్ కార్యక్రమాలు జరగనున్నాయి.




# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ఉద్యోగుల పాత్ర కీలకం : మంత్రి జగదీశ్ రెడ్డి

నల్లగొండ, మార్చి 4: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. విధి, విధానాలతో పాటు నిధులు విడుదల చేసేది రాష్ట్ర ప్రభుత్వం అయినప్పటికీ ఆచరణలో అమలుపరిచేది మాత్రం ప్రభుత్వ ఉద్యోగులేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజున యావత్ భారతదేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచింది అంటే అందులో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ప్రధానంగా ఉందని ఆయన ప్రశంసించారు.

శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా టీఎన్‌జీవో నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను మంత్రి జగదీష్ రెడ్డి ఆవిష్కరించారు. వాటితో పాటుగా అంగన్‌వాడి టీచర్స్ అసోసియేషన్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌లను కూడా మంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడారు.

ప్రజల మదిలో తెలంగాణ పదాన్ని ఒక శ్వాసగా మార్చింది టీఎన్‌జీవో ఉద్యోగులు అని ఆయన కొనియాడారు. 75 సంవత్సరాలుగా తెలంగాణ అస్తిత్వాన్నీ నిలబెట్టిన ఘనత కుడా టీఎన్‌జీవోలకే దక్కిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లావాత్మక మార్పులు తెచ్చిందన్నారు. పట్టణాలకే ఆ మార్పులు పరిమితం చెయ్యకుండా చివరి అంచు వరకు తీసుకపోవడంలో ఉద్యోగులు అందించిన సహకారం మరిచిపోలేనిదని పేర్కొన్నారు. మోదీ మాయాజాలం బట్టబయలు అయిందన్నారు. అనుచరులకు ప్రభుత్వ సొమ్ము రూ. 19 లక్షల కోట్లు ధారాదత్తం చేయడమే ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. పేదోడిని కొట్టి పెద్దోడికి పెట్టె విధంగా మోదీ చర్యలు ఉన్నాయని ఆయన దుయ్యబట్టారు. అటువంటి మోదీ సర్కార్ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలకు అవరోధాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. రుణమాఫీ పథకం కింద రూ. 26 వేల కోట్లు, రైతుబంధు పథకం కింద రూ. 60 వేల కోట్లు,ఆసరా ఫించన్ల కింద రూ. 15 వేల కోట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఓర్వలేక పోతుందన్నారు. అది కేంద్రానికి కంటగింపుగా మారి కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు మంజూరు చేయకుండా అడ్డు పడుతుందని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. సంపద సృష్టించాలి పేదలకు పంచాలి అన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అయితే బ్యాంకులను ఒక్కటి చేయాలి.. ఎల్ఐసీని పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయాలన్నది ప్రధాని మోదీ సంకల్పం అని ఆయన విమర్శించారు. అటువంటి మోదీ పాలనలో మొట్టమొదలు నష్టపోయిందే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అని పేర్కొన్నారు. అటువంటి కేంద్ర ప్రభుత్వ చర్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రి జగదీష్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మున్సిపల్ ఛైర్మన్ మందడి సైదిరెడ్డి, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాంచనపల్లి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాటలకే తప్ప చేతలు శూన్యం

**- తెలంగాణ ప్రభుత్వం లో కానరాని అభివృద్ధి...**
**- అందరి బంధువుగా శీనన్నను ఆదరించండి**
**- బయ్యారం క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవంలో పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 4 (నేటినిజం ప్రతినిధి): గడిచిన ఎనిమిదిన్నర సంవత్సర కాలంలో తెలంగాణ ప్రభుత్వంలో నాయకుల మాటలు... హామీలకే పరిమితమైనాయి తప్ప ఆచరణ లో మాత్రం ఐదు శాతం కూడా అభివృద్ధికి నోచుకోలేదని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బయ్యారం మండల కేంద్రంలో పొంగులేటి శీనన్న, కోరం కనకన్నల పేరుతో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవంలో శనివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి బంధువుగా... నిరుపేదలను ఆదుకోనేందుకు శీనన్న ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పార్టీల కు అతీతంగా మనందరం కలిసి పనిచేద్దామని... మీ సూచనలు సలహాల మేరకు నడుచుకుంటానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎనాడైనా నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడ్డారా అని ప్రశ్నించారు. ఇల్లందు నియోజక వర్గంలో ఆదివాసులు, గిరిజనులు, గిరిజనేతరులకు అభివృద్ధి ఫలాలు అందాయా అని ప్రశ్నించారు. రైతులకు రుణ మాఫీ, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, విద్యార్థులకు ఫీజు రీయంబర్సుమెంటు దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూం వచ్చాయా అని ప్రశ్నించారు రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎక్కడ ఉంచాలో మీరే నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం...రాబో యే రోజుల్లో మీకు అందు బాటులో ఉంటూ ఎల్లవేళలా మీ కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో శీనన్న క్యాంపు కార్యాలయాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే ఈ కార్యాలయాల ఏర్పాటుకు రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కోరం కనకయ్య, మండల సర్పంచ్ పొలేబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు సంకు సత్తిరెడ్డి, వన్నం రామారావు, రెంటాల బుచ్చిరెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు సనప సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సహజ సిద్ధమైన రంగుల ఆవిష్కరణ




రాజన్న సిరిసిల్ల, మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాబోవు హోలీ పండుగను పురస్కరించుకొని సైన్స్ విద్యార్థులు ప్రకృతి సహజ సిద్ధమైన రంగులను తయారు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయనాలతో చేసిన రంగులు ఆరోగ్యానికి హానికరం అని, ప్రకృతి సహజ సిద్ధమైన రంగులను మాత్రమే హోలీ పండుగకి వాడాలని ఆయన విద్యార్థులకు సూచించారు. కళాశాల విద్యార్థులు ప్రకృతి సహజసిద్ధ పదార్థాలయినా పండ్లు, కూరగాయలు, పూలు తదితర పదార్థాలయిన క్యారెట్, బీట్రూట్, కోతిమీర, గోగు పువ్వులతో ఆకుపచ్చ, ఎరుపు, పసుపుపచ్చ, నలుపు, గోధుమ, గులాబీ రంగులను తయారుచేసి ప్రయోగశాలలో ఆవిష్కరించినట్లు కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె వై కరుణ తెలిపారు. ఈ సహజ సిద్ధమైన రంగులతో కళాశాల విద్యార్థులు, ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె వై కరుణ, అధ్యాపకులు డాక్టర్ వి వెంకటేశ్వర్లు, మధు రాజేష్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీనివాసులు, కె. రాజేశ్, నారాయణ, నర్సయ్య, మధుబాబు, దీపిక, అర్జున్, రవేశ్ బాబు, ఫకీర్ బాబా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈ నెల 6న నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ రాక

**-ఉర్దూ మీడియం ఎస్సెస్సీ విద్యార్థులకు ఉచితంగా ఆల్ఇన్ వన్ గైడ్స్ పంపిణీ**



కరీంనగర్, మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 6న సోమవారం కరీంనగర్ నగరంలో ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాం లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూళ్లల్లో ఎస్సెస్సి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు, బోర్డు ఎగ్జామ్స్ లో వెసులుబాటు గా ఉండేందుకు సాలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఆల్ ఇన్ వన్ గైడ్స్ ఉచితంగా పంపిణీ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా విద్యార్థులు..తమ ఉపాధ్యాయులతో వచ్చి విజయవంతం చేయాలని ఎంఐఎం నగర అధ్యక్షుడు.. తెలంగాణ హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎంఐఎం కార్యాలయంలో గులాం అహ్మద్ మాట్లాడుతూ ఈ ఆల్ఇన్ వన్ గైడ్ల పంపిణీ కార్యక్రమానికి హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ వస్తున్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం విద్యార్థులు సోమవారం ఉదయం 10గంటలకు దారుస్సలాం చేరుకొని గైడ్ల ను పొందాలని కోరారు. కరీంనగర్ జిల్లాలో కార్యక్రమం ముగిశాక, మధ్యాహ్నం జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లిలో ఇదే కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, కార్పొరేటర్లు శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, నాయకులు ఆతిన, అలిబాబా, అజర్ దబీర్, అహ్మద్, ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.

# విహెచ్1 ప్రత్యేకంగా వి హెచ్ 1 బాస్ లాలో



హైదరాబాద్, మార్చి 4: పాప్ మ్యూజిక్ ఛానెల్ ఈ రోజును వారి ప్రత్యేకంగా నిర్వహించబడిన ప్లేలిస్ట్ హెచ్1 బాస్ లేడీతో జరుపుకోవడానికి సిద్ధమవుతోంది. ఈ ప్లేజాబితాలో నిక్కీ మినాజ్, టేలర్ స్విఫ్ట్, మిలే సైరస్, కెమిల్లా కాబెల్లో, సెలీనా గోమెజ్ మరియు వారి ప్రతిభతో అంతర్జాతీయ సంగీత వేదిక రోస్ట్రమ్‌ను అబ్బురపరిచిన కొంతమంది అసాధారణ ప్రతిభావంతులైన మహిళా గాయకులు కనిపిస్తారు. కాబట్టి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్1 బాస్ లేడీతో ప్రత్యేకంగా హెచ్1, మార్చి 8న, మధ్యాహ్నం 12 గంటలకు మరియు సాయంత్రం 6 గంటలకు అన్ని వినోదాల కోసం సిద్ధంగా ఉండండి. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మీరు హెచ్1 బాస్ లేడీలో అనుభవించే విభిన్న కళా ప్రక్రియలు, కళాకారులను చూద్దాం! హిప్ హాప్‌పరిశ్రమలోని ప్రముఖ మహిళలతో హిప్ హాప్ సంగీతం యొక్క శక్తివంతమైన రిథమ్‌ను చూడటానికి సిద్ధంగా ఉండండి. అమెరికన్ రాపర్ నిక్కీ మినాజ్, అత్యంత అందమైన కార్డి బి మరియు భారతదేశపు అత్యంత ప్రతిభావంతులైన ర్యాప్ దేవత, డీ ఎంసీ వీహెచ్1 బాస్ లేడీ యొక్క హిప్ హాప్ సెగ్మెంట్‌లో కనిపిస్తారు.

రోజంతా వారి సంగీతానికి గాను సిద్ధంగా ఉండండి మరియు హెచ్1తో మాత్రమే మీ మహిళా దినోత్సవాన్ని ప్రత్యేకంగా చేసుకోండి.

కె-పాప్‌కె-పాప్ సంగీతానికి పెరుగుతున్న ప్రజాదరణను దృష్టిలో ఉంచుకుని, హెచ్1 దాని వీక్షకులకు ఉత్తమమైన వాటిని అందించడానికి సిద్ధంగా ఉంది. హెచ్1 బాస్ లేడీ యొక్క ఐ-పాప్ విభాగంలో మూడు అత్యంత ప్రజాదరణ పొందిన ఐ-పాప్ మహిళా బ్యాండ్‌లు, బ్లాక్ పింక్, ట్వైస్ జి ఐడిల్ నుండి కొంత శక్తివంతమైన సంగీతం ఉంటుంది. మీరు మీకు ఇష్టమైన వాటిని వింటున్నప్పుడు మీ హాయిగా సౌకర్యవంతమైన మంచాలపై మీ స్నేహితురాళ్ళతో ఈ రోజు జరుపుకోవాలని నిర్ధారించుకోండి.

# అర్హులైన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**-నృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి**



రాజన్న సిరిసిల్ల, మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్యకళానికేతన్ సేవా సంస్థ ప్రధానకార్యాలయంలో శనివారం జిల్లా సాంస్కృతిక కళాసంస్థల సమాఖ్య రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కళాకారులు పాటలు, జానపద గేయాలు, నాటకపద్యాలు ఆలపించారు. అనంతరం నృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకొరకు తెలంగాణ ధూంధాంలో ఆటపాటలతో సాధించిన ఘనత కళాకారులదేనని చెప్పడం చాలా సంతోషమని తెలిపారు. కళాకారులని మర్చిపోకుండా అర్హులైన వృద్ధకళాకారులకి కొత్తగా దరఖాస్తులు స్వీకరించి పెన్షన్ మంజూరు చేయాలనిస్ అదేవిధంగా అర్హులైన కళాకారులకు రెండు గదుల ఇండ్లను మంజూరీచేసి కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. ప్రాచీన కళలు కనుమరుగు కాకుండా చూడాలని, తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కళాకారులందరికి ప్రభుత్వంచే గుర్తింపుకార్డులను అందజేయాలని విన్నవించారు. కళాకారులను అన్నిరకాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వచ్చేనెలలో జిల్లా కేంద్రం సిరిసిల్లకో జిల్లా స్థాయి కళాకారుల సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈసదస్సుకు ముగ్గురు ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సదస్సుకు జిల్లాలోని కళాకారులు పాల్గొనేలా చూడాలని జిల్లా కార్యవర్గ సభ్యులను కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక కళా సమాఖ్య

అధ్యక్షుడు సావనపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య, గౌరవాధ్యక్షులు బొడ్డురాములు, కోశాధికారి బుర్రి శంకరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు

బొడ్డు రాములు, సావన పెల్లి శ్రీనివాస్, బుర్రి శంకరయ్య, కేశన్న గారి రాధిక, గంగ శ్రీకాంత్, ఆడెపు చందు, బొడ్డు నారాయణ, ముస్తఫా, తాటికొండ లత, వనం రాజయ్య, మామిండ్ల సత్తయ్య, అన్నారపు హరీష్, మారం ప్రవీణ్, తదితర కళాకారులు పాల్గొన్నారు.

# గాయపడ్డ గీత కార్మికుడికి రూ.5,000 ఆర్థికసాయం



రాజన్న సిరిసిల్ల, మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన గీత కార్మికుడునాగెల్లి రాములు మూడు రోజుల క్రితం తాటిచెట్టు పైనుండి జారిపడి తీవ్రంగా గాయపడడంతో, కుటుంబ సభ్యులు అతడిని వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో రాములు వెన్నెముకతో పాటు ప్రక్కటెముకలు దెబ్బతినడంతో హైదరాబాద్ లోని ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యుల సూచన మేరకు తరలించారు.

కాగా ఇట్టి విషయం జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు చిదుగు గోవర్ధన్గౌడ్ తక్షణ వ్యక్తిగత ఆర్థికసహాయం కింద 5,000 రూపాయలను పంపించగా, ఇట్టి డబ్బులను గౌడసంఘం రాష్ట్ర సంపునూరి మల్లేశంగౌడ్, జిల్లా సంఘం సలహాదారు మెరుగు రఘుగౌడ్, నూకలమర్రి గ్రామ గౌడసంఘం అధ్యక్షులు మల్యాల సురేష్ గౌడ్ లు గీత కార్మికుల సమక్షంలో శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ అధ్యక్షులు పాలకుర్తి పర్శరాం గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రైతులు, ఎఫ్‌పీఓలకు మద్దతునందించేందుకు, భారతదేశంలో వ్యవసాయ రంగ వృద్ధిని వేగవంతం చేసేందుకు సమర్థ్ కృషి

హైదరాబాద్, మార్చి 4: ఫ్లిప్‌కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నేడు ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ వ్యవసాయ సమాజాలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌పీఓలు) కు జాతీయ మార్కెట్ అవకాశాలు అందించడంతో పాటుగా తమ వేదిక ద్వారా మరింతగా చర్చల శక్తిని అందించడం లక్ష్యంగా చేసుకున్నారు. భారతీయ రైతులకు సాధికారితనందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, వ్యవసాయ రంగానికి తోడ్పాటునందిస్తూ ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ప్రోగ్రామ్, మార్కెట్ అవకాశాలను అందించడం తో పాటుగా రైతులకు సామర్థ్యం సైతం నిర్మించాలని కోరుకుంటుంది. అదనంగా, స్థిరంగా వారు ఎదిగేందుకు సహాయపడుతూనే, మార్కెట్‌కు సిద్ధంగా ఉండడానికి మరియు సంబంధితమైన భాగస్వామ్యాల ద్వారా ప్రధాన ఆర్థిక వ్యవస్థలో భాగం కావడానికి సహాయపడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, రైతులు మరియు ఎఫ్‌పీఓలకు ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడానికి సాంకేతికత , ఉత్తమ పద్ధతులపై శిక్షణ మరియు నైపుణ్యాభివృద్ధి చేస్తారు. ఫ్లిప్‌కార్ట్ ఇండియాకు పలు పరిశ్రమలు మరియు ప్రభుత్వ సంస్థలతో చురుకైన భాగస్వామ్యాలు మరియు సహకారాలు ఉన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్, బీహార్, గుజరాత్, హర్యానా, కర్నాటక, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణా మరియు పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాలలోని వ్యవసాయ శాఖలు ఉన్నాయి. వీటి ద్వారా తమ ఈ?కామర్స్ వేదికపై ఎఫ్‌పీఓలను చేర్చుకుంటున్నాయి. ఈ భాగస్వామ్యాల ద్వారా, ఫ్లిప్‌కార్ట్ ఇండియా తృణధాన్యాలు, పప్పులు, మసాలా దినుసులు నేరుగా రైతులు మరియు ఎఫ్‌పీఓల నుంచి సేకరిస్తుంది. తద్వారా స్థానిక వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరుస్తూనే, భారతదేశ వ్యాప్తంగా వేలాది మంది రైతుల జీవనోపాధిని సైతం మెరుగుపరుస్తుంది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ చీఫ్ కార్పొరేట్ ఆఫీసర్ రజ్నీష్‌కుమార్ మాట్లాడుతూ " రైతులు మరియు ఎఫ్‌పీఓలు భాగస్వామ్యంతో ఫ్లిప్‌కార్ట్ ఇండియా యొక్క భాగస్వామ్యం, స్థానిక రైతుల ఆదాయాన్ని పెంచడానికి మరియు దేశవ్యాప్త స్థాయిలో వారి ఉత్పత్తులను అందించడానికి సహాయపడుతుంది. సాంకేతికత, ఆవిష్కరణ, ఈ ?కామర్స్ యొక్క శక్తిపై ఆధారపడి ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కృషి ప్రోగ్రావ్ , భారతదేశపు సామాజిక?ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటుగా రైతులు నుంచి వినియోగదారుల వరకూ విలువ చైన్‌లో ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. భారతీయ వ్యవసాయ రంగం మరియు గ్రామీణ సమాజాలపై సానుకూల ప్రభావాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నాము" అని అన్నారు.

# చిన్నారులకు అన్న ప్రాసన



రాజన్న సిరిసిల్ల, మార్చి 4: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు గ్రామ సర్పంచి దుమ్ము అంజయ్య అన్నప్రాసన చేశారు, అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల అన్నప్రాసన, అక్షరాభ్యాసం, జన్మదిన వేడుకలు నిర్వహించడం మంచి కార్యక్రమం అన్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీల,కు బాలింతలకు, చిన్నారులు పౌష్టికాహారం, పాలు, కోడిగుడ్లు, ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని కూడా అందివ్వడం జరుగుమన్నారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు మంజుల పంచాయతీ కార్యదర్శి సందీప్, ఏఎన్ఎం రమాదేవి పాల్గొన్నారు.


ఆహ్వానం

గుంటూరు జిల్లా రచయితల సంఘం

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత

సాహితీ కళారత్న కొణతం నాగేశ్వరరావు రచించిన

గీతరచనాదీపిక

గ్రంథావిష్కరణ సభ

తేది : 12-03-2023 ఆదివారం ఉదయం 10 గం॥లకు

వేదిక : శ్రీ కొరటాల మీటింగ్ హాలు, 2/7 బ్రాడీపేట, గుంటూరు

కార్యక్రమం

సభాధ్యక్షులు : శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య, అధ్యక్షులు, గుంటూరు జిల్లా రచయితల సంఘం

గ్రంథావిష్కర్త : ప్రొ॥ గుజ్జర్లమూడి కృపాచారి, విశ్రాంతాచార్యులు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

ఆత్మీయ అతిథులు : సరస్వతీ పుత్ర డా॥ భూసురపల్లి వెంకటేశ్వర్లు, హంస అవార్డు గ్రహీత

నటశేఖర తుర్లపాటి రాధాకృష్ణ మూర్తి, కవి, పండితులు, నాటక ప్రయోక్త

గ్రంథ స్వీకర్త : శ్రీ మేళం బాబూరావు, విశ్రాంత వైస్ ప్రిన్సిపల్, హిందూ కళాశాల, గుంటూరు

గ్రంథ సమీక్ష : శ్రీ ఎం. కృష్ణ కిశోర్ భాషాప్రవీణ

శ్రీ కె.జె. రమేష్, ఉపాధ్యక్షులు, గుంటూరు జిల్లా రచయితల సంఘం

నిర్వహణ

ఎస్.ఎం. సుభాని - నానా

ప్రధాన కార్యదర్శి కోశాధికారి


Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.